




ఏలూరు డిపిటిఒపై చర్యలు తీసుకోవాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-నెల్లూరు : మోడల్ ఆఫ్ కాండక్ట్ పేరుతో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి సుందరయ్యను అక్రమంగా సస్పెండ్ చేసిన ఏలూరు డిపిటిఓపై చర్యలు తీసుకోవాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన చేపట్టారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలో ఉద్యోగులు, కార్మికులు సంయుక్తంగా నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పేరుతో అక్రమంగా సస్పెండ్ కు గురైన ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి సుందరయ్య, 54 మందిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమ సస్పెన్షన్లకు కారణ మైన ఏలూరు డిపిటిఒపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ఆర్‌టిసి అధికారులకు వినతిపత్రం అందజేశారు.



బాబు తొలి సంతకంతో ఆనందోత్సవాలు..!

రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్. చంద్రబాబునాయుడు గురువారం రాష్ట్ర సచివాలయంలో పదవీబాధ్యతలు తీసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఐదు హామీల అమలుకు తొలి సంతకం పెట్టారు. దీంతో జిల్లాలోని వృద్ధులు, వింతంతులు.వికలాంగులు, కిడ్నీ బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రసుత్తం ఇస్తున్న పింఛన్‌కు అదనంగా వెయ్యి రూపాయలు పెంచారు. గత ప్రభుత్వం మూసేసిన అన్నా క్యాంటీన్లను మళ్లీ తెరుచుకోనున్నాయి. మెగా డిఎస్‌సిపై సంతకం చేయడంతో జిల్లాలో సుమారు 500-700 మందికి అవకాశం దక్కనుంది. యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్‌లు అమలు చేయనున్నారు. ఎంతో ప్రమాదకంగా భావించిన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశారు. తొలి సంతకంతో జల్లాలోనే అనేక మంది పేదలకు ప్రయోజనం కలగడంతో ఆనందంలో మునిగి తేలుతున్నారు. మిగిలినవి ఎప్పుడంటూ ఆత్రుత్తగా ఎదురుచూస్తున్నారు..

- ❍3.19 లక్షల మందికి పింఛన్ వెయ్యి పెంపు
- ❍నెలకు అదనపు భారం రూ.31 కోట్లు
- ❍ఏడాదికి రూ.1512 కోట్లు పంపిణీ
- ❍సుమారు 500 మంది టీచర్లలకు ప్రయోజనం
- ❍పేదలకు రూ.5అన్నం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబునాయుడు ఐదు కీలకమైన హామీలు నెరవేర్చారు. చంద్రబాబునాయుడు హామీలు ఇస్తారు.. అమలు చేయరనే ప్రతిపక్ష వైసిపి నోరు మూతపడేలా ఒకే సంతకంతో అనేక ప్రయోజనాలు చేకూర్చేలా చేశారు. ఐదు ప్రధానమైన హామీలను పూర్తి చేశారు. తొలి సంతకం 1. మెగా డిఎస్‌పి 2.పింఛన్ వెయ్యి పెంపు 3. ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు 4, అన్నా క్యాంటీన్లు పునరుద్దరణ 5, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ పై వరుసుగా సంతకాలు చేశారు. దీంతో ఒక్కసారిగా జిల్లాలో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అనేక హామీలిచ్చినప్పటికీ తొలుత ఐదు పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాపితంగా 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. దీని కోసం నిరుద్యోగయువత ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జిటి, టిజిటి, పిజిటి, ప్రిన్సిపల్, పిఇటి పోస్టులు సుమారు 500 నుంచి 700 మధ్యలో ఉంటాయని తెలుస్తోంది. ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో ఇప్పుడు విద్యాశాఖ అధికారులు ఆఘమేఘాలపై నివేదిక తయారుచేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో డిఎస్‌సి అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న రూ.3 వేల పింఛన్‌ను వెయ్యి రూపాయలు పెంచుతామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం జిల్లా వ్యాపితంతా 3.19 లక్షల పింఛన్లు ఇస్తున్నారు. ఇందుకోసం రూ.95 కోట్లు ప్రతి నెలా ఒకటో తేదీ వలంటీర్లు ఇంటికి చేర్చుతున్నారు. రేపు నెల నుంచి పింఛన్‌దారులు అందరికీ వెయ్యి రూపాయలు పెంచి ఫైల్లపై సిఎం సంతకం చేశారు. ఈ నిర్ణయంతో ప్రతి నెలా వృద్ధులు, వితంతువులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6 వేలు అందజేస్తారు. దీంతో సుమారు రూ.31 కోట్లు ప్రతి నెలా అదనంగా భారం పడనుంది. ఇకపై ప్రతినెలా రూ.1512 కోట్లు కేవలం పింఛన్ కోసమే ఖర్చు చేయనున్నారు. ఈ నిర్ణయం అందరిలో ఆనందం తెప్పించింది. నియమ నిబంధనలు ఏమీ బయటకు రాలేదు. గత ప్రభుత్వం జిల్లా వ్యాపితంగా నెల్లూరు, కావలి, ఆత్మకూరు, నాయుడుపేట,గూడూరు, మున్సిపాలిటీ ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్లు ఏర్పాట్లు చేశారు. టిపిన్ రూ. 3, బోజనం రూ. 5 లకే అందించారు. నిరుపేదలు అనేక మంది అక్కడ భోజనం చేసి ఆకలి తీర్చుకునేవారు. గత ప్రభుత్వం ఈ భవనాలను సచివాలయాలుగా, ఇతర ఆఫీసులు, ఖాళీగా పడేసింది. ప్రభుత్వ నిర్ణయంతో త్వరలో తెరుచుకోనున్నాయి. ఈ నిర్ణయం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు చేస్తామని ప్రకటించింది. భూములు కలిగిన వారు ఆందోళన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని సిఎం ప్రకటించారు. ఈ మాట ప్రకారం రద్దు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కోసం అనేక చోట్ల కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇకపై అక్కడ యువతకు శిక్షణ ఇవ్వనున్నారు. ఐదు అంశాల్లో సిఎం నిర్ణయం తీసుకున్నా అనేక హామీలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. ప్రతి పిల్లవాడికీ రూ. 15 వేలు, 18 సంవత్సరాలు నిండిన స్త్రీలకు నెలకు రూ.1500, ఉచిత బస్సు సౌకర్యం, మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లు, నిరుద్యోగ భృతి వంటి వాటి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.



అన్న క్యాంటీన్ (ఫైల్)


సిఎం చంద్రబాబునాయుడు సంతకం చేస్తున్న దృశ్యం

బక్రీదు ప్రార్ధనల ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు : ఈనెల 17న జరిగే బక్రీదు పర్వదినాన ముస్లిములు ప్రార్ధనలు నిర్వహించుకునేందుకు నగరంలోని బారా షహీద్ దర్గాలో నిర్వహించే ఏర్పాట్లపై రూరల్ శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి దర్గా ఆవరణంలో జిల్లా అధికార యంత్రాంగంతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముస్లిం మత పెద్దలు, నగరపాలక సంస్థ కమిషనర్ వికాశ్ మర్మత్, డిఆర్వో లవన్న ఇతర విభాగాల అధికారులు హాజరయ్యారు. రూరల్ నియోజకవర్గానికి మూడో సారి శాసనసభ్యుడిగా ఎన్నికైన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దర్గాలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం బక్రీదు పర్వదినాన్ని జరుపు కునేందుకు నిర్వహించాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. పండుగ రోజున దర్గా ఆవరణంలో ముస్లిం సోదరలు ప్రార్ధనలు నిర్వహించుకునేందుకు ఏలాంటి ఆటంకాలు లేకుండా ఏర్పాట్లు పక్కాగా చేయాలని సూచించారు. ఈ ఏర్పాట్లు అన్ని ఒక్క రోజు ముందుగానే పూర్తి చేయాలని అధికారులకూ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లా డుతూ గతంలో చేపట్టిన 141 రోజుల మహా పాదయాత్ర కార్యక్రమాన్ని బక్రీదు రోజే ప్రారంభించానని గుర్తు చేశారు. బక్రీదు అంటే తనకు సెంటిమెంట్ అని పేర్కొన్నారు. ముస్లిం సోదరులకు ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చినా తనను కలవవచ్చునని తెలిపారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీధర్‌రెడ్డి

16న డాక్టర్ జెట్టి శేషారెడ్డి స్మారక సదస్సు

ప్రజాశక్తి-నెల్లూరు

ఈ నెల 16న నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ జెట్టి శేషారెడ్డి 16వ స్మారక సదస్సు నిర్వహిస్తున్నట్లు ట్రస్టు ఛైర్మన్ చంద్ర రాజగోపాల్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేవాఉ. ఈ కార్యక్రమాన్ని డాక్టరు జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం, డాక్టరు రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల, యుటిఎఫ్, ప్రజా రోగ్యవేదిక, జనవిజ్ఞాన వేదిక, ఎపి ఎంఎస్‌ఆర్‌యు, ఎపి ఎంహెచ్‌ఈయుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా భారత రాజ్యాంగం– విలువలు– సవాళ్లు అన్న అంశంపై విశ్రాంత ఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.రజని ఉపన్యాసిస్తారన్నారని తెలిపారు. ఆరోగ్య హక్కు చట్టం –2024 అన్న అంశం పై ప్రజారోగ్య నిపుణులు, పాండిచ్చేరి ప్రాంతానికి చెందిన ప్రపంచ ప్రజారోగ్య సమన్వయకర్త డాక్టరు టి.సుందర్‌రామన్ ప్రసంగిస్తారన్నారు. ప్రజలు, మేధావులు ఈ సదస్సుకు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుడ్లూరు : గుడ్లూరు ఎంఎస్‌ఆర్ గిరిజన కాలనీలో లో ఓల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని సిపిఎం గుడ్లూరు నాయకులు జి వెంకటేశ్వర్లు కొట్టే వెంకయ్య, జి స్టాలిన్, జి రాజేష్ అధికారులను డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం ప్రతినిధి బృందం ఎంఎస్‌ఆర్ గిరిజన కాలనీని సందర్శించింది. గిరిజనులు సిపిఎం బందానికి తమ సమస్యలను వివరించారు. ప్రధానంగా తమకు సిపిఎం కషి ఫలితంగా స్తంభాలు , వైర్లు లాగారు. కరెంట్ అధికారులకు సిపిఎం వారికి కతజ్ఞతలు తెలియజేస్తున్నాం.. అన్నారు. లో ఓల్టేజీ కారణంగా సక్రమంగా విద్యుత్ లేని కారణంగా అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నామని సిపిఎం బందాన్ని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఎంఎస్‌ఆర్ గిరిజన కాలనీలో త్రీఫేస్ ఏర్పాటు చేసి, ట్రాన్స్ ఫారం బిగించి గిరిజనులకు నిరంతరం విద్యుత్ సౌకర్యం కలగజేయవలసిందిగా అధికారులను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. సిపిఎం మండల కన్వీనర్ జి వెంకటేశ్వర్లు సిపిఎం గుడ్లూరు శాఖ కార్యదర్శి కొట్టే వెంకయ్య జి స్టాలిన్, ఎర్ర ప్రగడ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గడ్డం రాజేష్, స్థానిక గిరిజనులు రాపూరి మాల్యాద్రి వెంకయ్య దుర్గ శ్రీదేవి ఉన్నారు..


సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రారంభం

ప్రజాశక్తి-జలదంకి

గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకే ఆంగ్ల పాఠశాలను ప్రారంభిస్తున్నట్లు శ్రీ సాయి విద్యాసంస్థల అధినేత బత్తిన అయ్యల్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన జలదంకిలోని కావలి ఉదయగిరి రోడ్డు సమీపంలో జలదంకి జమ్మలపాలెం మధ్య ఏర్పాటైన శ్రీ సాయి ఇంగ్లీష్ మీడియం స్కూలును గురువారం అయ్యల రెడ్డి ప్రారంభించారు. మండలానికే కాక ఇటు కావాలి అటు కలిగిరి మండలాల విద్యార్థులకు సానుకూలంగా ఉంటుందని ఈ ప్రాంతంలో ఆంగ్ల పాఠశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 35 ఏళ్లుగా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఈ సంస్థ ద్వారా విద్యార్థుల మంచి ప్రతిభను కనపరచడమే కాక అత్యుత్తమ శిఖరాలను అధిరోహించారని గుర్తు చేశారు.

సుబ్బారావు సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి -వలేటివారిపాలెం : స్టేట్ బ్యాంకులో ఖాతాదారులకు అసిస్టెంట్ మేనేజర్ సుబ్బారావు అందించిన సేవలు ప్రశంసనీయమని మేనేజర్ కే నరేష్ బాబు తెలిపారు. మండల కేంద్రమైన వలేటివారిపాలెం స్టేట్ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న సుబ్బారావుకు మేనేజర్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేనేజర్ నరేష్ బాబు మాట్లాడుతూ స్టేట్ బ్యాంకుకు సుబ్బారావు విశేష సేవలు అందించినట్లు తెలిపారు. బ్యాంకు అభివృద్ధి, తోట్పాటుకు ఎనలేని కషి చేశారని ఆయన తెలిపారు. ఖాతా దారులతో మమేకమై ఎప్పటికప్పుడు సేవలు అందిస్తూ వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసినట్లు తెలిపారు. బ్యాంక్ అభివృద్ధికికి కూడా విశేష కృషి చేసినట్లు తెలిపారు. ఉద్యోగులకు బదిలీలు సహజమేనని ఆయన తెలిపారు. . బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు ప్రగడ శ్రీనివాసులు, కండ్లగుంట మాలకొండయ్య మాల్యాద్రి రాజు ఉన్నారు.



అక్రమాలపై విచారణ జరిపించాలి

నెల్లూరు : హాస్పిటల్ అభివృద్ధి కమిటీ, జిల్లా కో ఆర్డినేటర్‌గా లక్ష్మీ సునంద పనిచేసిన సమయంలో ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయని, జిల్లా అధికారులు తక్షణమే విచారణ చేపట్టి అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వైద్య శాల సూపరింటిండెంట్ డాక్టరు సిద్దానాయక్‌కు పలువరు వ్యక్తులు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.. ఈ అంశంపై మీడియా వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టరు సిద్దానాయక్‌ను కలిసి వివరణ కోరగా ఆయన సమాదానం చెప్పకుండా దాటవేస్తున్నారు. టిడిపి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో వైద్యశాల సూపరింటిండెంట్ గుట్టుచప్పుడు కాకుండా హాస్పిటల్ అభివృద్ది కమిటీ జిల్లా కో ఆర్డినేటర్‌కు చెందిన గదికి తాళాలు వేశారు. జిల్లా ఉన్నతాధికారులు కల్పించుకొని పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలన్నారు.

పాదయాత్ర బృందానికి స్వాగతం

ప్రజాశక్తి - లింగసముద్రం : రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, కొండేపి ఎంఎల్‌ఎగా డోల బాల వీరాంజనేయ స్వామి గెలిచిన సందర్భంగా ఆయన అభిమానులు కొండేపి నుంచి మొక్కు చెల్లించుకునేందుకు తిరు మలకు చేపట్టిన పాదయాత్ర గురువారం లింగసముద్రం సమీ పానికి చేరుకుంది. పంచాయ తీలోని రామ కష్ణాపురం తెలుగు యువత నాయకులు వారికి స్వాగతం పలికారు. వారితో మాట్లాడి కూల్ డ్రింక్స్ అందజేశారు. లింగసముద్రం మండలం తెలుగు యువత అధ్యక్షులు అడపా రంగయ్య ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు పాదయాత్ర చేస్తున్న వారిని కలిసి సంఘీభావం తెలిపారు. మండల పార్టీ కార్యాలయంలో వారితో మాట్లాడారు. తిరుమల చేరుకునే వరకు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. టిడిపి నాయకులు బచ్చు మాల్యాద్రి, చెంబేటి రమేష్, చెంబేటి ప్రభాకర్, దాసరి దేవేంద్ర,చెంబేటి మాలకొండ రాయుడు, దిడ్డి వెంగబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేత

కందుకూరు : విద్యుత్ షాక్‌తో మరణించిన కార్యకర్త కుటుంబానికి కందుకూరు ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు తోడుగా నిలిచారు. మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన ఇనకల్లు నరసింహం అనే యువకుడు రెండు రోజుల కిందట గ్రామంలో సిఎంగా చంద్ర బాబు నాయుడకు ప్రమాణ స్వీకార శుభాకాంక్షలు తెలియచేసే ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తూ విద్యుత్ షాక్‌తో మరణించాడు. ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వంరావు గురువారం సాయ ంత్రం ఆ కుటుంబాన్ని పరామర్శించి నరసిం హం తల్లి అనురాధను ఓదార్చారు. కుటుం బానికి తాను అండగా ఉంటానని ఎలాంటి అవసరం వచ్చినా తనకు తెలియజేయాలని భరోసా ఇచ్చారు. రూ. 2 లక్షల ఆర్థిక సహాయాన్ని ఆమెకు అందించారు.గ్రామ టిడిపి అధ్యక్షులు సాదినేని మాల్యాద్రి ఉన్నారు.



15న ఎంఎల్‌ఎలకు సన్మానం

కందుకూరు : కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, చీరాల శాసనసభ్యులు ఎం ఎం కొండయ్యలకు యాదవ సంఘం ఆధ్వర్యంలో శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యాదవ సంఘం నాయకులు తెలిపారు. కందుకూరు ఆర్‌కె బిల్డింగ్ కనిగిరి రోడ్డులో15న ఉదయం 11 గంటల 30 నిమిషాలకు సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని యాదవ సంఘం నాయకులు వై. లక్మినారాయణ గురువారం తెలిపారు.

ఎంఎల్‌ఎ ప్రశాంతి రెడ్డికి శుభాకాంక్షలు

కోవూరు : కోవూరు ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని కొడవలూరు మండలం, మానేగుంటపాడు, రెడ్డిపాళెంకు చెందిన గ్రామస్తులు గురువారం నెల్లూరులోని ఆమె నివాసంలో కలిశారు.ఆమెకు పుష్పగుచ్చం అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడి పని చేశారన్నారు. వారి అభిమానమే గెలుపునకు విజయం చేకూర్చిన నియోజకవర్గ ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : ఆదాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు పెంపకం కార్యక్రమం జరిగింది. "మా భూమి–మన భవిష్యత్తు' అనే నినాదంతో అదాని ఫౌండేషన్, అదాని కష్ణపట్నం పోర్టు లిమిటెడ్ ఈ కార్యక్రమం చేపట్టింది. పర్యావరణ పరిరక్షణ కోసం "భూ పునరుద్ధరణ, ఎడారీకరణ లేని ప్రాంతంగా "మా భూమి, మన భవిష్యత్తు, అనే నినాదంతో అదాని ఫౌండేషన్ అదానీ కష్ణ పట్నం పోర్టు లిమిటెడ్ ముత్తుకూరు మండలం, నారికెళ్లపల్లి పంచాయతీ భ గస్వామ్యంతో జూన్ 5 పర్యావరణ దినోత్సవం కార్యక్రమం ప్రారంభమైంది. గురువారంతో 14 వేల మొక్కలు నాటారు. కష్ణపట్నం, ఆర్కాటపాలెం గ్రామంతోపాటు, ముత్తుకూరు పంచాయతీలోని అదాల్‌నగర్, రామలిం గాపు రం చలివేంద్రం గ్రామాలు నారికెళ్ల పల్లి గ్రామ పంచాయతీ తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. మొక్కలు నాటే కార్యక్రమంలో గ్రామస్తులు ప్రజలు, గ్రామ పంచా యతీల వార్డు సభ్యులు, ఉపసర్పంచ్‌లు, సర్పంచ్‌లు పాల్గొని మొక్కలు నాటారు. రాజశేఖర్, చంద్రశేఖర్, భవానీ శంకర్, మహేంద్ర, కష్ణపట్నం గ్రామానికి చెందిన అఖిల్, రాంనగర్ గ్రామానికి చెందిన వెంకట్ రామయ్య, పాండు, ఆర్కోటపాలెం గ్రామానికి చెందిన పో లయ్య పాల్గొని తమ వంతు సహకారాన్ని అందించారు. ఆదాని ఫౌండేషన్ హెడ్ రాజేష్, రంజ న్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వ హించారు. సలీల్ శ్రీవాస్తవ, అదానీ కష్ణపట్నం పోర్ట్ లి మిటెడ్ పర్యావ రణ, ఆరోగ్యం, భద్రత విభాగానికి చెందిన వేణుగోపాల్ రెడ్డి, హేమ, హేమలత, అముద, గోవిం దమ్మ, వనజ, గీతారాణి, సునంద, టి అరుణ్, షేక్ షా హుల్ హమీద్ , డాక్టర్ సి. రమేశ్ బాబు పాల్గొన్నారు.



మానసిక వికలాంగుల పాఠశాలకు

విరాళంగా స్కూల్ వ్యాన్ అందజేత

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరులోని స్వర్ణ స్వయంకషి మానసిక వికలాంగుల పాఠశాలకు ఎల్ఐసి గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ (లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) వారి ఆర్థిక సహాయంతో రూ 18,20,710 విలువ చేసే స్కూల్ వాన్ ను ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ బి . ప్రసాద్ రావు, ఎల్ఐసి మార్కెటింగ్ మేనేజర్ ఓ . కష్ణ మూర్తి, ఎల్ఐసి కందుకూర్ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ ఐ వి ఏ కాంతారావు చేతుల మీదగా పాఠశాల కరెస్పాండంట్ ఎస్ . సుబ్బా రెడ్డి కి విరాళం అందజేశారు. బ్రాంచ్ మేనేజర్ కాంతారావు మాట్లాడుతూ మానసిక వికలాంగుల పిల్లలు కొరకు స్కూల్ వాన్ ను యల్ఐసి ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది అన్నారు. రాబోయే రోజులలో ఎల్ఐసి తరుపున మరిన్ని సేవ కార్యక్రమాలు చేస్తాము అని చెప్పారు. పాఠశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి ఎల్ఐసి వారికి ధన్యవాదాలు తెలిపారు. ఎల్ఐసి సిబ్బంది ఏజెంట్లు పాల్గొన్నారు.



కేన్సర్ నివారణకు ముందస్తు వైద్య పరీక్షలు

నెల్లూరు : క్యాన్సర్ మనిషి మరణానికి దారి తీస్తుందని, ఈ ప్రమాదాన్ని అరికట్టడానికి ముందస్తు పరీక్షలు, ఆరంభదశలో గుర్తించి చికిత్సలు తీసుకోవడంతో నివారణకు దోహదపడుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు ఎం. పెంచలయ్య పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఎసిఎస్‌ఆర్ ప్రభుత్వ కళాశాలలో మూడవ లెవల్ క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణా తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు వసుందరాదేవి, వైస్ ప్రిన్సిపాల్ గోవింద్, ఎన్‌సిడి ప్రాజెక్టు ఆఫీసర్ సుధీర్‌కుమార్, జిల్లా కో ఆర్డినేటర్ విజయ్‌విష్ణు జ్యాతిలు పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న వారు ఎన్‌సిడి 3.0 కమ్యూ నిటీ లెవల్‌లో క్యాన్సర్ వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి చికిత్సలు తీస ుకొనే విధంగా చైతన్యం కలిగించాల న్నారు. కావలి, ఆత్మకూరు ప్రాంతాల్లో సైతం ఈ తరహా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.



రవ్వా శ్రీనుకు సన్మానం

ప్రజాశక్తి-కందుకూరు

స్థానిక స్వర్ణ ప్యాలెస్ హోటల్లో జరిగిన కందుకూరు ఎల్ ఐ సి ఏజెంట్స్ మీటింగ్ లో శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు,కందుకూరు వాసవి క్లబ్ లెజెండ్స్ ప్రెసిడెంట్, డాక్టర్ రవ్వా శ్రీనివాసులు కి గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ బి.ప్రసాద రావు, మార్కెటింగ్ మేనేజర్ ఓ. కష్ణ మూర్తి సన్మానించారు. కందుకూరు ఎల్. ఐ. సి. సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఐ.వి.ఎ.కాంతారావు మాట్లాడుతూ తమ బ్రాంచ్ ఏజెంట్ అయిన డాక్టర్ రవ్వా శ్రీనివాసులు గత కొన్నేళ్లుగా చేస్తున్న వివిధ రకాల సేవలను గుర్తిస్తూ గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. డాక్టర్ రవ్వా శ్రీనివాసులు మాట్లాడుతూ గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకోవడం సమాజంలో మేము చేసే సేవా కార్యక్రమాల బాధ్యతను పెంచిందని అన్నారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏ.బి.ఎమ్.విజయ్ కుమర్ పాల్గొన్నారు.



టిడిపి ఫ్లెక్సీ చించివేత

తోటపల్లిగూడూరు : టిడిపి ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. దాంతో టిడిపి నాయ కులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టిడిపి కూటమి అభ్యర్థిగా మాజీ మం త్రి సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి అఖండ విజయాన్ని పు రస్కరించుకొని అభిమానులు ఆయన ఫోటోతో ఇస్కు పాలెం గ్రామం సెంటర్లో భా రీ సైజ్ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలో ఏ ర్పాటు చేసిన చంద్రమో హన్ రెడ్డి అభి మానులకు సం బంధించిన ఫోటలో సరిగ్గా మెడ భాగంలో గుర్తు తెలియని వ్యక్తులు బ్లేడ్ తో కట్ చేశారు. ఈ ఘటన గ్రామంలో వివాదానికి దారితీస్తుం డటంతో గ్రామస్తులు ఆందోళన చెందుత న్నారు. ఫ్లెక్సీ ధ్వంసంతో తెలుగు తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పరిస్థితితో గ్రామంలో అలజడి నెలకొంది.

దొడ్డం రెడ్డి నిరంజన్ రెడ్డి డిఎంబి ఛైర్మన్ పదవికి రాజీనామా

ప్రజాశక్తి-కోవూరు

వైసీపీ సీనియర్ నేత డిఏఏబి జిల్లా ఛైర్మెన్‌గా ఉన్న దొడ్డం రెడ్డి నిరంజన్ బాబు రెడ్డి గురువారం పదవికి రాజీనామా చేశారు. తన లేఖను జిల్లా వ్యవసాయఅధికారికి జిల్లా కలెక్టర్‌కు ఇచ్చినట్లు తెలిపారు.


మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి-గుడ్లూరు : గుడ్లూరు ఎస్‌సి కాలనీలో ఉన్న ఓ బంకులో బ్రాందీ సీసాలు అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో పోలీసుల తనిఖీలు నిర్వహించారు. జి నాగేశ్వరరావు బంకులో ఉన్న ఎనిమిది మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఐసిడిఎస్ కార్యాలయంలో

బిసిజి వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం, జిల్లా అధికారుల సూచనల మేరకు ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో అడల్ట్ బి సి జి వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభించారు. గురువారం వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం పెంచలయ్య , డిస్టిక్ లెప్రసీ ఎయిడ్స్ అండ్ టిబి ఆఫీసర్ డాక్టర్ ఎస్ కే ఖాదర్ వలీ, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఐ సి డి ఎస్ హేమ సుజన్ ఆధ్వర్యంలో ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు మాట్లా డుతూ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పరీక్షలు నిర్వహించి, ఎవరైతే ఆరు ప్రాధాన్యాతాలకు అర్హులౌతారో వారందరు ఈ వ్యాక్సినేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర పరిశీలకులు శశికాంత్ టీబి నివారణ సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



నేడు 'ఇంటూరి' అభిమానుల పాదయాత్ర

ప్రజాశక్తి - వలటివారిపాలెం : కందుకూరు ఎంఎల్‌ఎగా ఇంటూరి నాగేశ్వరరావు విజయం సాధించిన నేపథ్యంలో ఆయన సతీమణి సౌజన్య గారి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, అబి . మానులు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు వలేటివారిపాలెం మండలం బడేవారిపాలెంనుంచి మాలకొండ పుణ్యక్షేత్రం వరకు పాదయాత్ర చేపట్టనున్నారు. అనంతరం అక్కడ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవడం జరుగు తుందన్నారు.

మరో వైపు కందుకూరు నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా మంచి మెజారిటీతో ఎంఎల్‌ఎగా ఇంటూరి నాగేశ్వరరావు విజయం సాధించడం, ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు గెలిచినందుకు నాగేశ్వరావు అభిమానులు మొక్కు తీర్చుకునే నిమిత్తం కందుకూరు అంకమ్మ తల్లి ఆలయం నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టిన విషయం విధితమే ఆ పాదయాత్ర గురువారం గూడూరు దాటి వెంకటగిరి నియోజకవర్గం లోకి ప్రవేశించింది. అబ్బూరి వేణు ఆధ్వర్యంలో పాదయాత్ర సాగుతోంది

జగన్‌ను కలిసిన ఎంఎల్‌సి 'తూమాటి'

ప్రజాశక్తి-కందుకూరు : వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్వహించిన వైసిపి ఎమ్మెల్సీల సమావేశానికి హాజరైన ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎం ఎల్‌సి తూమాటి మాధవరావు హాజం ్యయ్యారు. అనంతరం ఆయన జగన్ మో హన్ రెడ్డిని కలిసి పలు విషయాలపై చర్చించారు.



మంత్రి 'ఆనం'ను కలిసిన పలువురు

ప్రజాశక్తి-అనంతసాగరం

ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని విజయవాడలో గురువారం తెలుగుదేశం పార్టీ మండల సీనియర్ నాయకులు, సోమశిల మాజీ ఎంపీటీసీ యోగు పెంచ లయ్య ఆధ్వర్యంలో సోమశిల తెలుగుదేశం నేతలు గువ్వల పెంచలయ్య, కే నరసింహులు, పొంగూరు మురళి, ముక్కు నాగరత్నం, కె.పెంచలయ్య చంటి కలిశారు. ఈ సందర్భంగా ఆనం రామనా రాయణరెడ్డిని ఘనంగా సన్మానించి పూల బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ మాట్లాడుతూ ఆనం రామనారాయణరెడ్డికి మంత్రి పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. మండల, గ్రామ అభివృద్ధి ఆనం ఆధ్వర్యంలో దూసుకు పోతుందని తెలిపారు.

ప్రజాశక్తి-ఉదయగిరి



మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని శాసనసభ్యులు కాకర్ల సురేష్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కోరారని దీనితో మెట్ట ప్రాంత అభివృద్ధి ఆయనతోనే సాధ్యమవుతుందని కాకర్ల ధీమా వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి-ఉదయగిరి

మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఆనం రామనారాయణరెడ్డిని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మాజీ జెడ్పి చైర్మన్ పి. చెంచలబాబు యాదవ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారంవిజయవాడ గేట్ వే హోటల్లో మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి పదవి దక్కడం జిల్లా ప్రజలందరికీ సంతోషకరమని ఆనం రామనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా అన్ని ప్రాంతాలు పూర్తిగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ముఖ్యంగా మెట్ట ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి బీసీ సెల్ నాయకులు వెంగయ్య యాదవ్ పాల్గొన్నారు.

టిడిపి నాయకులపై వైసిపి దాడి

ప్రజాశక్తి-అనంతసాగరం: మండలంలోని శంకర్ నగరంలో గురువారం టీడీపీ నాయకులు విజయోత్సవ సంబరాలు జరుపుకుంటున్న సమయంలో అదే గ్రామానికి చెందిన వైసీపీ వర్గీయులు మారణాయుధాలతో దాడి చేశారు. ఈ దాడిలో పలువురుకి గాయాలయ్యాయి. క్షత గాత్రులను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తరలించారు. గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. శుక్రవారం ఉదయం ఎస్పి గ్రామంలో పర్యటించారు. సంఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.దాడి చేసిన వారిని గుర్తించామని త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనేందుకు పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట డిఎస్పి కోటారెడ్డి, సిఐ వేణు, ఎస్ఐలు సూర్యప్రకాష్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, సుబ్బారావులున్నారు.

కావలిలో నేత్రదానం

ప్రజాశక్తి-కావలి. :కావలి పట్టణం పుల్లారెడ్డినగర్‌కు చెందిన శీలం కోటేశ్వరరావు (86) వృద్ధాప్యంతో గురువారం మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేశారు. ఈ సందర్భంగా అయన కుమారుడు, పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శీలం విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, తమ తండ్రి కోటేశ్వరరావు నేత్రదానంపై పూర్తి అవగాహన కలిగి ఉండేవాడని, గతంలో తమ తల్లి శీలం చెంగమ్మ మరణించినప్పుడు ఆమె నేత్రాలను దానం చేయించారన్నారు. ఇప్పటికి తమ కుటుంబంలో ఏడుగురు మరణానంతరం నేత్రదానం చేశారన్నారు. ఇది కావలి రెడ్ క్రాస్ ద్వారా జరిగిన 133వ నేత్రదానమని కావలి రెడ్ క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్ పేర్కొన్నారు. నెల్లూరు మోడరన్ ఐబ్యాంకు సిబ్బంది కోటేశ్వరరావు కార్నియాలను సేకరించారు.

రక్త దానానికి సహకరించండి

ప్రజాశక్తి-కావలి: వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా కావలి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో నిర్వహిస్తున్న రక్త దాన కార్యక్రమం లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ని, వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గం వరకు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్లో జరిగే ఉచిత రక్తదాన శిబిరంలో రక్త దాతలు విరివిగా పాల్గొనాలని తెలిపారు. రక్తదానం చేసి తమ రక్తంతో ఆగిపోతున్న ఊపిరికి ప్రాణాలు పోయాలని కోరారు. కార్యక్రమంలో వి ఫౌండేషన్, రహీం చారిటబుల్ ట్రస్ట్, ప్రియదర్శిని మహిళా మండలి, గుడ్ మెన్స్ చారిటబుల్ ట్రస్ట్, టైం టు హెల్ప్ ట్రస్ట్, ప్రపంచ మానవ హక్కుల అవగాహనా సంఘం నిర్వాహకులు పాల్గొన్నారు.

రాజధాని రైతులకు సత్కారం

ప్రజాశక్తి-కావలి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన అమరావతి రాజధాని రైతులను కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి సత్కరించారు.. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి రాజధాని రైతులు ఘన స్వాగతం పలికారు. సిఎం చంద్రబాబు వెళ్లే దారి మొత్తం వాళ్లు పూలు పరిచారు.చంద్రబాబు పై పూలు చల్లుతూ వారు స్వాగతం పలికారు. అమరావతి రాజధానిగా ఉండాలని వారు చేసిన పోరాటాన్ని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిని కొనియాడారు.

శ్రీచైతన్య విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి-కావలి: కావలి శ్రీచైతన్య విద్యార్థి విష్ణు సూర్య తేజ ప్రకాష్, నీట్ పరీక్షల్లో ఎం.బి.బి.ఎస్. సీట్ సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థికి గురువారం కళాశాల తరపున కరస్పాండెంట్ ఎస్. వెంకయ్య, డైరెక్టర్ శ్రీ పి వి ఎస్ ప్రసాద్ ప్రిన్సిపల్ టి. లుకోదర్, మరొక డైరెక్టర్ ఎం.కొండయ్య, బాటని లెక్చరర్ మల్లికార్జున రావు విద్యార్థిని అభినందిస్తూ పుష్పగుచ్ఛం అందించి, ఘనంగా అభినందిం చారు. వాళ్ల తల్లిదండ్రులు అరుణ, శ్రీనివాసులు స్పందిస్తూ, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల అధ్యాపక బృందానికి అభినందనలు తెలియజేశారు. గురువుల శ్రద్ధ వలెనే మా కుమారుడు ఇంతటి విజయాన్ని సాధించారని తెలిపారు. ఇంత మంచి కళాశాల స్థాపించిన డైరెక్టర్లకు నమస్సుమాంజలి తెలియజేశారు.

ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డితో అధికారులు భేటి

ప్రజాశక్తి-విడవలూరు: కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కోవూరు నియోజకవర్గ వ్యవసాయ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గురువారం నెల్లూరులోని వి.పి.ఆర్ నివాసానికి చేరుకున్న ఏడీ డి.సుజాత, ఏఓ మేరి కమల, నాగార్జున తదితరులు ప్రశాంతిరెడ్డి ని కలిసి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రానున్న ఖరీఫ్ సీజన్లో పంటల సాగు వివరాలతో పాటు నియోజకవర్గంలో వ్యవసాయ సంబంధిత విషయాలపై వారితో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చర్చించారు.అదేవిధంగా కొడవలూరు మండల పంచాయతీ సెక్రటరీ జి.జాలయ్య, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిని మర్యాదపూర్వాకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. మండలంలోని వివిధ గ్రామాలలో పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలను ఎమ్మెల్యేకి వివరించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై చర్చించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జి.రాధాకృష్ణ, వి.శీనయ్య, ఆర్ శివకుమార్, డి.కామేశ్వర రావు తదితరులున్నారు.

రూ.50వేలు నగదు అందజేత

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల మృతి చెందిన 5 కుటుంబ సభ్యులకు శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, నిత్య అన్నదాత శ్రీ కంచి పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.10 వేలు వంతున మొత్తం రూ.50 వేలు నగదును దాతత్వం చేశారు.గత కొన్ని నెలలుగా ఆత్మకూరు పట్టణంలో మృతి చెందిన ప్రజలకు, వారి కర్మకాండల ప్రక్రియ కోసం నిత్యాన్నదాత ,శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత శ్రీ కంచి పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మృతి చెందిన కుటుంబ సభ్యులకు చేస్తున్న రూ.10వేలు ఆర్థిక సహాయం కార్యక్రమం ఆత్మకూరు పట్టణంలో నిర్విరామంగా కొనసాగుతుంది. గురువారం ఆత్మకూరు పట్టణంలో శ్రీ నిత్య అన్నదాత శ్రీ కంచి పరమేశ్వర్ రెడ్డి చేసిన దాతత్వం ఐదు కుటుంబాలను పరామర్శించిన నిత్యాన్నదాత శ్రీ కంచి పరమేశ్వర్ రెడ్డి ఒక్కొక్కరికి రూ.10 వేలు వంతున మొత్తం రూ.50వేలు దాతత్వం చేశారు. ఈ సందర్భంగా శ్రీ కంచి పరమేశ్వర్ రెడ్డి మీ కుటుంబాలకు నేనెప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు.లబ్ధి పొందిన కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమకు రూ.10వేలు దాతృత్వం చేసిన నిత్య అన్నదాత శ్రీ కంచిపరమేశ్వర్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామని తెలిపారు.కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న దృశ్యం

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై హర్షం

ప్రజాశక్తి-కావలి



న్యాయవాది పొట్లూరు శ్రీనివా సులు

సిఎం చంద్రబాబు తొలిరోజు తన పరిపాలనలో ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను తన రెండవ సంతకంతో రద్దుచేసి, తన మాటను నిలబెట్టుకున్నారని టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది పొట్లూరు శ్రీనివాసులు సిఎంను అభినందిస్తూ, హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తే.21-10-2023న గత జగన్ ప్రభుత్వం నిరంకుశంగా ఈ చట్టాన్ని తెచ్చిందని,ఈ చట్టం న్యాయబద్ద మైనది కాదన్నారు. అది ప్రజల భూములకు భద్రత కల్పించలేదని, రాష్ట్రంలోని న్యాయవాదులు, మేధావులు, రైతులు అనేక నిరసన కార్యక్రమాలు చేసినా, ప్రభుత్వం పట్టించుకో లేద న్నారు.న్యాయవాదులు ఎన్నోసార్లు నిరసన వ్యక్తం చేసి కోర్టులను బహిష్కరిం చారని తెలి పారు. జగన్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా పట్టించుకోలేదన్నారు. టీడీపీ అధినేత ప్రజల బాధలు, ఇబ్బందులు గమనించి, తన ఎన్నికల మేనిఫెస్టోలో తాను గెలిచి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మొదటి రోజునే ఈ చట్టాన్ని రద్దు చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. చెప్పిన మాటప్రకారం ఈ నల్ల చట్టాన్ని ఒక్క సంతకంతో రద్దు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.లోగడ ఈ చట్టాన్ని రద్దుచేయాలని, నిరసనలు, కోర్టు బహిష్కరణలు చేసిన రాష్ట్రంలోని న్యాయవా దులు అందరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ ఆందోళనలో ప్రజలకు, న్యాయవాదులకు, రైతులకు అండగా నిలిచి ఉద్య మంలో పోరాడిన టీడీపీ జాతీయ కార్యదర్శి బీద రవిచంద్రకు, కావలి ఎం.ఎల్.ఏ. కావ్య కృష్ణారెడ్డిలకు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల ఆకాంక్షలకు, ఆశలకు స్పందించే ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిందని, అందరి కష్టాలను తీరుస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరరణ

ప్రజాశక్తి-వరికుంటపాడు: మండలంలోని తూర్పు రొంపిదొడ్ల గ్రామంలో వెలసి ఉన్న శ్రీ మానసా దేవి అమ్మవారి 10వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని ఆలయ చైర్మన్ చల్లా తిరుపతయ్య తెలిపారు. గురువారం తూర్పు రొంపిదొడ్ల గ్రామంలోని మానసా దేవి అమ్మవారి ఆలయంలో బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆలయ ధర్మకర్తలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తుల పాలిట కొంగు బంగారం గా కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరు తెచ్చుకున్నటువంటి శ్రీ మానసా దేవి అమ్మ వారి బ్రహ్మో త్స వాలు వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 28వ తేదీ శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనము, నవగ్రహ మండపారాధన, మూలవిరాట్లకు ఉత్సవ విగ్రహాలకు నవగ్రహ విగ్రహాలకు మహా స్నానము పంచామృత అభిషేకము, మహా నివేదన తీర్థప్రసాదాలు సాయంత్రం ఐదు గంటలకు శ్రీ లక్ష్మీ నారాయణ కళ్యాణ ము కార్యక్రమం నిర్వహించడం జరుగుతుం దన్నారు. అదేవిధంగా 29వ తేదీ శనివారం గణపతి నవగ్రహ శ్రీ సూక్తా సర్వశుక్త సాహితీ మానసా దేవి హోమం, తదితర కార్యక్ర మాలు నిర్వహించడం జరుగుతు ందన్నారు. మూడు రోజులపాటు వచ్చిన భక్తులందరికీ అన్న ప్రసాద కార్యక్ర మాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, కార్యనిర్వహణ అధికారి చల్లా యగ్నేశ్వర రావు, వైస్ చైర్మన్ చల్లా మాల్యాద్రి, ఆలయ అర్చకులు ప్రవీణ్ శర్మ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రైల్వే స్టేషన్‌లోనే రిజర్వేషన్ కౌంటర్ ఉండాలి

ప్రజాశక్తి-బిట్రగుంట: .బిట్రగుంట రైల్వే స్టేషన్‌లోని బుకింగ్ కార్యాలయాన్ని, రిజర్వేషన్ కౌంటర్‌లను ప్రయివేటీకరణ తగదని, బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షులు షేక్ నూరుద్దీన్ పేర్కొన్నారు. సందర్భ ంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ రిజర్వేషన్ కౌంటర్‌ను ప్రయివేట ీకరణను తాము అడ్డుకుంటామని, రైల్వే అభివృద్ధి కోసం టెండర్ ప్రక్రియను ఎవరు ముందుకు రాకపోగా రైల్వే శాఖ రిజర్వేషన్ కౌంటర్‌ని కొన సాగిస్తూ వస్తు ందన్నారు. కొత్తగా ఒక వ్యక్తి వచ్చి టెండర్ వేసిన పక్ష ంలో రిజర్వేషన్ కౌం టర్‌ను తొలగించి ప్రయి వేట్ వారికి జనరల్ టికెట్ మాత్రమే అమ్మే విధంగా రైల్వే శాఖ నిర్ణయం తీసుకుందని తెలిపారు .కోట్ల రూపాయల ప్రజాధనంతో రైల్వేస్టేషన్లో రూపురేఖలు మార్చి ఉన్న ప్రజల సౌకర్యాలను తొలగించడం ఎంతవరకు సబబు అని తెలిపారు. అల్లూరు ,దగదర్తి, బోగోలు మండలంలోని ప్రజలు సుదీర ప్రాంతాలకు వెళ్లేందుకు బిట్రగుంట రైల్వే స్టేషన్ నుంచి రిజర్వేషన్ చేసుకొని వారని, రిజర్వేషన్ కౌంటర్ ఇక్కడ నుండి ఎత్తివేయడంతో మూడు మండలాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటా రన్నారు. ప్రజల కోసం రైల్వే పని చేయాలే తప్ప ఆదాయం కోసం కాదని తెలిపారు. రైల్వే ఉన్నతాధికారులు ఈ టెండర్ ప్రక్రియను ఉపసంహరిం చుకోవాలని ,బిట్రగుంట కమిటీ సభ్యులు, అల్లూరు, దగదర్తి, బోగోలు మండల ప్రజలు, వ్యాపారస్తులు కోరుతున్నారని తెలిపారు.



కళ్యాణమండపానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-బిట్రగుంట: బోగోలు మండలం కొండబిట్ర గుంట గ్రామం సమీప ఉన్న ద్వారకా నగర్ శ్రీ షిరిడి శేష సాయి బాబా మందిర ప్రాంగణంలో గురువారం కళ్యాణ మండపం శంకుస్థాపన కార్యక్రమాన్ని సాయి భక్తులు, సాయిబాబా మందిర వ్యవస్థాపకుడు కుట్టు బోయిన బ్రహ్మానందం కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశేష సాయి మందిర ప్రాంగణంలో కళ్యాణం చేసుకునేవారికి భజనలు నిర్వహించే దానికి కళ్యాణ మండపాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పేదలకు ఉచితంగా కళ్యాణం నిర్వహించేందుకు ఈ కళ్యాణ మండపాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు .శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా సాయి విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి గణపతి పూజ ను నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వర్లు, మహేంద్ర, తేజ, చక్రపాణి ,బ్రహ్మానందం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



కిట్లు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

నూతన విద్యా సంవత్సరం కావస్తున్న దృష్ట్యా గురువారం ఆత్మకూరు పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్ లో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి 20 వార్డు కౌన్సిలర్ సూరా భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఆయన విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవర్నమెంట్ హై స్కూల్ అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి దృష్టికి వినతి పత్రం రూపంలో తీసుకెళ్లి తప్పకుండా పని చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ డిఇఒ గోపాల్, స్కూల్ హెడ్మాస్టర్ అనంతలక్ష్మి, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఒంటరి మల్లికార్జున్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ జాతీయ సమైక్య శిబిరానికి

శ్రీచైతన్య విద్యార్థినులు ఎంపిక

ప్రజాశక్తి-కావలి.



కావలి శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో చదువుతున్న జి.దీక్షిత, ఎం.ఆకాంక్షలు ఎన్.ఎస్.ఎస్ జాతీయ సమైక్య శిబిరానికి ఎంపికయ్యారు. అందుకు కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ నెల జూన్ 14 నుంచి 20వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలో బెంగళూరులోని బెంగళూరు సిటీ యూనివర్సిటీలో ఈ ఎన్.ఎస్.ఎస్ జాతీయ సమైఖ్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ పి.జానకిరామ్ మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాల నుంచి ఎన్నో సేవాకార్యక్రమాలు ఎన్ఎస్ఎస్ ద్వారా చేపడుతున్నామన్నారు. తద్వారా విద్యార్థులు ఉత్సాహంగా ఈకార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. దాని ప్రభావంతో మాకళాశాల విద్యార్థి యూనివర్సిటీ స్థాయిలో ఎంపికైన పదిమందిలో ఇద్దరు సెలెక్ట్ అవడం గర్వకారణమని తెలియ జేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పి.వి.రావు మాట్లాడుతూ మా కళాశాల విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి కాకుండా సామాజిక సేవతో పాటు మానసికంగా ధృఢంగా మార్చడానికి స్పోర్ట్స్ లో కూడా విద్యార్థులని ప్రోత్సహిస్తున్నామని తెలియ జేశారు.కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.జానకిరామ్, కళాశాల ప్రిన్సిపల్స్ పీవీ. రావు, డా".రవికాంత్, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.వి.సాయి తేజ, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యా ర్థులు పాల్గొని జి.దీక్షిత, ఎం.ఆకాంక్షలను ఘనంగా అభినం దించారు.

నర్రవాడలో పల్లకి సేవ ఊరేగింపు

ప్రజాశక్తి-ఉదయగిరి: దుత్తలూరు మండలం, నర్రవాడ వెంగమాంబ పేరంటాలు అమ్మవారి దేవస్థానంలో గురువారం పల్లకి సేవ కార్యక్రమం నిర్వహించినట్లు దేవస్థానం ఈఓ ఉషశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గురువారం పల్లకి సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ఈ నెల 23నుంచి 27వ తేదీ వరకు వెంగమాంబ పేరంటాలు అమ్మవారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారని, ప్రతి ఒక్కరూ అమ్మవారిని దర్శించుకుని తమ కోర్కెలు తీర్చుకోవచ్చని కోరారు.

మందు బాబులకు అడ్డాగా ఉన్నత పాఠశాల

ప్రజాశక్తి-ఇందుకూరుపేట: మండలంలోని నరసాపురం ఎంవిఆర్ఆర్ ఉన్నత పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. విద్యార్థుల మరో గుడిగా భావించే పాఠశాల నేడు మందు బాబులకు ఆసరా చేసుకుని నిత్యం మద్యం సేవించడమే కాకుండా అమ్మకాలు కూడా రాత్రిళ్లు, పొద్దున్నే బ్రాందీ షాపులు లేని సమయాల్లో యథేచ్ఛగా అముతున్నారు. ఇకనైనా అధికారులు పాఠశాలపై ప్రత్యక నిఘా పెట్టి అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధి హామీ పనుల్లో తనిఖీ

ప్రజాశక్తి-మర్రిపాడు: మండలం నందవరంలో జరుగుతోన్న మహాత్మా గాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హామీ పనులను ఏపీఓ పి.వెంకట నారాయణ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతల ప్రకారం పనులు పూర్తి చేసి ప్రభుత్వం ప్రకటించిన దినసరి కూలి రూ.300 పొందాలని ఉపాధి హామీ కూలీలకు సూచించారు. జాబ్ కార్డులో ఒకరి పేరుతో మరొకరు పనులకు రాకూడదన్నారు.వేసవి దృష్ట్యా ఉదయం 6 నుంచి 11 లోపు పనులను పూర్తిచేసుకోవాలని కోరారు. .ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ షేక్ ఖాదర్ బాషా, ఉపాధి కూలీలు ఉన్నారు.

5వ తరగతి పాసైన విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలి

ప్రజాశక్తి-అనంతసాగరం: మండలంలో ఐదో తరగతి విద్యార్థులను ఉన్నత పాఠశాలలో చేర్పించాలని అనంతసాగరం ఉన్నత పాఠశాలల పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని ఉపాధ్యాయులు మెట్టుకూరు సుబ్బారెడ్డి, కేతా సుబ్బారెడ్డి, ఖాజా మొహిదీన్ ప్రచారం నిర్వహించారు. అనంతసాగరం క్లస్టర్ పరిధిలోని దేవరాయపల్లి, లింగంగుంట పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు వద్ద ఐదో తరగతి చదివిన విద్యార్థులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఐదో తరగతి పూర్తి చేసుకునే విద్యార్థులతో ఉపాధ్యాయులు మాట్లాడారు. అనంతసాగరం ఉన్నత పాఠశాలలో నాణ్యతమైన విద్యను అందిస్తామని పాఠశాలలో చేరాలని కోరారు.

మేకను కాపాడబోయి వ్యక్తి మృతి

ఉదయగిరి: మండల పరిధిలోని శకునాలపల్లి గ్రామానికి చెందిన ఈర్ల వెంకటయ్య (75) తన మేకను కాపాడబోయే మృత్యువాత పడ్డారు. వివరాల మేరకు.. మేకలను మేత కోసం తోలుకొని వెళ్లిన ఈర్ల వెంకటయ్య బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు బావిలో పడిపోయిన తన మేకను కాపాడే నిమిత్తం బాయిలోకి దిగిన వెంకటయ్య బావిలో తామరాకులు పాచి ఉండడంతో బావిలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు గురువారం ఉదయం పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టంకు ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.